


# మధు పథంలో మల్లిక

"బాలకృష్ణ"

కథానిక

నిరాశతో వేగిపోతున్నాడు మధు. అతని పరిసరాల్లోనే నిస్పృహ ఆవరించుకుంది. నిరుద్యోగం ప్రబలిపోతోంది. అది చేస్తాం యిది చేస్తాం అని అంతా అరిచేవారేకాని చేసేవారు ఎవరూ లేరు; ఇంతమందిలో తను ఒకడు. తను ఏం లెక్క? యూనివర్శిటీ కాన్వకేషన్‌లో మూడువేలమంది డిగ్రీలు తీసుకున్నారు. మూడు వేలలో తను ఒకడు. వీళ్ళంతా ఏం చేస్తారో? ఇద్దరు ముగ్గుర్ని కదిపిచూశాడు. ఏం చెయ్యాలా అన్న ప్రశ్నే బాధిస్తోంది వాళ్ళనీ. ఉన్ని దుస్తుల్లో ఉన్న వాళ్ళను పలకరించి చూశాడు. ఒకాయన పెళ్ళికి ఇరవయి వేలు పుచ్చుకుని విదేశాలు వెళుతాడట. ఒకాయన ఏనాటికయినా తగలకపోతుందా అని పజిల్సు కడుతున్నాడట. మరొక అతను "ఏదో చెయ్యాలేమిటి? ఏంచేస్తే కాలక్షేపం అవదూ?" అన్నాడు. ఆయన చాలా పెద్ద పలుకుబడి ఉన్న ఆసామి పుత్రుడు. అవును ఆయనకు వాటంతట అవే వస్తాయి ఉద్యోగాలు.

ఇంటికి వెళ్ళగానే అమ్మ "అబ్బాయ్ నీకు ఎంత వస్తుందిరా ఉద్యోగంచేస్తే?" అని అడిగింది. తను ఏదో వెలగబెట్టాడని అమాయకురాలి ఆశ. తను 'ఒక వంద' అంటే 'అట్టే చదవని నాన్నగారే సంపాదిస్తున్నారు' అంటుంది. అనకపోయినా అనుకుంటుంది. ఆమెను నిరుత్సాహపరచడం యెందుకనుకుంటూ ఉండగా "అయిదొందలు వస్తాయి కదురా" అంది ఆమె. తనకోసం చాలా కష్టపడింది. ఆమె మెళ్ళో మంగళసూత్రాలుకూడా తాకట్టులోఉన్నాయి.

మధుకి ఒక పెళ్ళి సంబంధం వచ్చింది. అయిదు వేలు యిస్తారట. మధు తండ్రి అటూయిటూ చెప్పలేదు. "అంతా అబ్బాయి యిష్టం" అన్నారు. తల్లి చాలా సంతోషంగా చెప్పింది: "అబ్బాయి యింక మన కష్టాలు అన్నీ గట్టెక్కినట్టేరా!" అని.

అవతలవాళ్లు అయిదువేలు యిస్తామన్నారు. అయిదు వేలు! ఆడపిల్లను కన్న పాపానికి అయిదు వేలు అప్పుచేసి పెళ్ళిచేసి హీనావస్థలో మగ్గిపోతారు. తన పినతండ్రి జ్ఞాపకంవచ్చాడు. కూతురికి పెళ్ళిచేసి యీనాటికీ కోలుకోలేక నానా బాధా పడుతున్నాడు. వీళ్ళూ అంతే; తప్పనిసరి కనక ఇస్తామంటున్నారు. లేకపోతే ఈరోజుల్లో అయిదు వేలు గుమ్మరించగల సామాన్య సంసారులు యెవరున్నారు? ఏమయినా కట్నం పుచ్చుకోగూడదు. అది రాక్షసత్వం. పుచ్చుకుని బంధువుల కులాసా కోసం, లోకుల పొగడ్తలకోసం తగలెయ్యకూడదు. అది బుద్ధిహీనత.

ఎదురుగా పుస్తెపూసాలేని అమ్మ కనపడింది బోసి మెడతో. నగలతో లక్ష్మిలా ఉండవలసిన అమ్మ దరిద్రానికి అపరచిహ్నంలా లేదూ! "పుచ్చుకోవద్దు కట్నం, లేనివాళ్ళ పిల్లను చేసుకుందాం" అని తను అంటే తనమీద ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆమె అమాయికహృదయం ఏమయిపోతుంది? పోనీ తను సంపాదించగలడా? లేదు. ఈ విధంగానయినా... చేసుకోనని చెపితే అమ్మ కంట నీరు పెట్టుకుంటుంది. "మేం పడ్డ కష్టాలు నువ్వు గుర్తించలేదు" అంటుంది. నాన్నగారు చేసిన

అప్పు తీర్చడం ఎలాగ అనే వేదనలో పడిపోతారు. తండ్రికి వచ్చే వందరూపాయల జీతంతో మూడువేల అప్పు ఎలా తీరుతుంది? తను తీర్చగలడా? ఎలా? అమ్మతో నాన్నతో— "ఆ అప్పు గురించి బెంగపెట్టుకోకండి—మన బాధ వదుల్చుకోవడం కోసం దాన్ని యింకొకళ్ళమీదకు నెట్టడం అన్యాయం - ఆ అప్పు నే తీర్చుకుంటాను" అని చెప్పగలడా తను? ఏ ధైర్యంమీద? ఎలా తీరుద్దామని? తన శక్తిమీద తనకు నమ్మకంలేదు.

"మధుకు హఠాత్తుగా పజిల్లో లక్షరూపాయలు వచ్చాయి! లక్ష! ఏం చెయ్యాలో అర్థంకానన్ని రూపాయలు. అటు కూలిచేసుకు బతకలేక, ఇటు అడుక్కోలేక మాడి చచ్చే మధ్యతరగతుల వాళ్ళందరికీ పంచిపెట్టాడు. కాదుకాదు. పెద్దమిల్లు పెట్టాడు. అందులో అత్యవసరవస్తువులు అన్నీ తయారు అవుతాయి. అమ్మేందుకు ఎంతమందో కావాలి. వేలమంది గ్రాడ్యుయేట్సుకి ఉద్యోగాలిచ్చాడు. ఆంధ్రదేశం అంతా అల్లుకుంది తన పరిశ్రమ. అంతా ఉద్యోగులయారు...". ఏదో ఏదో అల్లా ఆలోచనలు తీగలుసాగుతూ ఉంటే కలల్లో విహరించడం ఒక్కటే కనపడింది తను చెయ్యగల్గింది.

ఏదో హఠాత్తుగా మార్పురావాలి. అంతా మారిపోవాలి. క్షుధితప్రజానీకం బాగుపడాలి. ఆలోచించి ఆలోచించి తండ్రితో చెప్పేశాడు, తను కట్నంపుచ్చుకుని చేసుకోనని. తండ్రి ఏమీ అనలేదు. అమ్మ 'మేం చెప్పాం. తర్వాతనీయిష్టం' అంది. అందులో నిబిడీకృతమైవున్న బాధ హృదయానికి ఆఘాతంలా తగిలింది. బాధపడ్డాడు. నిశ్చయాన్ని మార్చుకుందాం అనుకున్నాడు. మార్చుకోలేకపోయాడు. నెలలతరబడి ఆలోచించి తేల్చుకున్న విషయం అది. తన ఆశయం తనకోసం ఒకర్ని బాధపెట్టకపోవడం. అయితే అమ్మా నాన్నా దీనివల్ల బాధపడడంలేదూ? తనతో రక్తసంబంధం ఉండి తనను పెంచినవాళ్ళ బాధకోసం, ముక్కూ మొగం ఎరగనివాళ్ళను బాధపెట్టడం అన్యాయంకదూ. ఈరోజు అమ్మనుచూసి ఒప్పుకుంటే తనజీవితం అంతా తను బాధపడొద్దూ? ఎందరో గతించారు. ప్రవాహంలో కొట్టుకుపోయారు. అలాగే తనూ పోతాడు-అంతేగా. కాదు. ఎదురు ఈదాలి. అన్యాయాన్ని అరికట్టాలి. ఆనాడే తన జీవితసార్థకత. ఈ ఆశయాన్నే వదులుకున్న తర్వాత తను బ్రతికినా చచ్చినా ఒకటే.

అమ్మకోసం యీపనిచేసి తన ఆత్మను చంపుకుంటేమాత్రం ఏం?

తండ్రిదగ్గరకువెళ్ళి "మనబాధలు నాకు తెలుసు-అయినా వాటినుంచి తప్పుకుందుకు ఒకరిమీదకు నెట్టడం అంత మంచిపనికాదు. నా శాయశక్తులా ప్రయత్నిస్తా. అవి తీర్చింతర్వాతే పెళ్ళి చేసుకుంటా. ఇప్పుడు తొందరేం? అంతగా తీర్చలేని అసమర్థుణ్ణని తేలిపోతే, యిప్పుడు యిచ్చినవాళ్లు అప్పుడు యివ్వకపోరు కట్నం. అప్పుడే పుచ్చుకుందాం" అని చెప్పాడు.

అర్థం చేసుకున్నాడు తండ్రి. "ఇటువంటి ఆలోచనలేం పెట్టుకోకు. ఎల్లాగో ఒకలాగ తీర్చుకోవచ్చు. వెధవ మూడువేలు తీర్చలేక పోతామా?" అన్నాడు.

ఆఖరిమాటలు ఆయన ఎంత మామూలుగా అని, కొడుకును మరిపిద్దాం అని చూచినా అదంటే ఆయన అనుకున్న భయాన్ని వ్యక్తపరుస్తూనే ఉన్నాయి. మధు గ్రహించకపోలేదు. గ్రహించి మాత్రం చెయ్యగలిగింది ఏముంది? అందుకు గ్రహించిన అర్థం తన భావనమాత్రమే అని నమ్మేందుకు ప్రయత్నించారు. అయినా అది వెంటాడుతూనే ఉంది.

* * *

నెలలు తిరుగుతున్నాయి. ఉద్యోగంరాలేదు. తను బ్రతుకుతున్నాడు తండ్రిమీద ఆధారపడి. ఆయన్ని చేజేతులా కష్టాల్లోకియీడ్చి; పురుగుమీదపడి బ్రతికే పురుగులా. ముసలితండ్రి రక్తం పీల్చుకుంటున్నాడు తను. తనకు ఉద్యోగంరాదు.

అమ్మముఖంలో ఆనందం ఏమయింది? ఎంత ప్రేమతో లాలిస్తోంది? బుజ్జగిస్తోంది తనని? చిన్నతమ్ముణ్ణి కంటె తననే గారాబంగా చూస్తోంది. తనకు ప్రొద్దున్నే తమ్ముడిచేత యిడ్డెన్లు తెప్పించి పెడుతుంది. తమ్ముడు తినడుట—ప్రొద్దున్నే చద్దన్నం తిన్నాడుకదురా అంటుంది. నాన్నగారు తనన్నమాటకు దేనికీ మారు చెప్పరు. "అది కాదు యిది" అనరు. ఆ యింట్లో అందరి

మాటకంటె తనదే చెల్లుబడి అవుతుంది. నాన్న గారికి వేపుడులు సయించకపోయినా తనకు యిష్టంకనక అవే చేస్తుంది అమ్మ.

అంతా తనంటే చాలా యిదిగా చూస్తు న్నారు. అమ్మా నాన్నా యిద్దరూ తను చూస్తూ ఉండగా చాలా సంతోషంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతే! నిజంగా సంతోషంగా ఉంటున్నారని నమ్మలేకపోయాడు. నమ్మదామని ప్రయత్నించాడు; అయినా నమ్మలేకపోతున్నాడు.

ఒకరోజున అమ్మవచ్చి "బట్టలు ఉన్నాయిరా అబ్బాయి! లేకపోతే చాకలికి కబురుపంపాలా?" అని అడిగింది.

ఎందుకు తన బట్టల ప్రసక్తి? ఎవరన్నా వచ్చారేమిటి? అమ్మాయిని చూడమని. అమ్మాయిని చూడటం!—చూసుకురావడం! తను మంచిబట్టలు వేసుకువెళ్ళాలి. తనను పెద్ద మర్యాదచేస్తారు. తమను ఉద్ధరించేందుకు వచ్చిన భగవంతుడు లాగ వాళ్ళకు తను కనిపిస్తాడేమో! అలా పాదం క్రింద పెట్టనివ్వరు. ముసలివాళ్ళుకూడా తను కాళ్ళుకడుక్కుంటే, తడితుడుచుకుందుకు తువ్వాలిచ్చేందుకు అగ్గగలాడుతూ నుంచునివుంటారు పొడికట్టుల్ని ఆనుకుని. తనను తీసుకువెళ్తారు లోపలికి. చుట్టూ పదిమంది కూర్చుంటారు. బుట్టబొమ్మలా తయారుచేసి అమ్మాయిని తీసుకువస్తారు.

—"ఉన్నాయా అబ్బాయి?"

అమ్మ రెట్టించింది ప్రశ్నని. ఉలిక్కిపడి మళ్ళీ యీ ప్రపంచంలో పడ్డాడు.

"అదేం పరధ్యానంరా? రాజుగాడి పెళ్ళి... మనం వెళ్ళకపోతే బాగుండదు. అంతా వెళ్దాం అంటున్నారు నాన్న..."

అందుకా బట్టలు అడుగుతు! తను మంచిబట్టలు కట్టుకువెళ్ళాలి. తను నీటుగా తిరుగుతే నలుగురూ చూస్తారు. చూసి ఎవరబ్బాయి అనుకుంటారు వాళ్ళలోవాళ్లు. ఏం చదివాడనుకుని సమాధానం తెలుసుకుని తనకు ఓ అయిదువేలు యిస్తామంటారు. కొంచెం ఎర్రగా ఉన్నాడుమరి బేరం బాగా ఎక్కువచ్చు. బేరం వచ్చేందుకు 'పబ్లిసిటీ'కోసం తను వెళ్ళాలి.

"నే రానమ్మా..."

"అదేమిట్రా అబ్బాయి. నువ్వు ఒక్కడవూ యిక్కడేంచేస్తావు? బాగుండదురా..."

తను మాట్లాడలేదు.

"తప్పుగా ఉంటుంది. ఎంతో యిదిగా చేసుకుంటూ ఉంటే...పదివేలుపుచ్చుకొని చెలోచోలోమంటూ..."

పదివేలా? పదివేలు. కట్నం. డబ్బు. ఎందుకెత్తుతారు, తనదగ్గర డబ్బుమాట కట్నంమాట? తనకి అది జ్ఞాపకంచేసి తన అసమర్థతను ఎత్తి పొడిచేందుకా? తనను న్యూనత పరచేందుకా?

"అందుకేరాను ఆ వెధవ పెళ్ళికి. పదివేలుచ్చుకుంటున్నాడట, వెధవ ఎందులోనన్నా పడి చావలేక పోయాడు."

అమ్మమాటను మధ్యలో తుంచాడు.

అమ్మ మారుమాట లేకుండా వెళ్ళిపోయింది. లక్ష్మివంటి అమ్మ యింట్లోకి, దరిద్రదేవతలా వెళ్ళిపోయింది. కలకలలాడే అమ్మముఖం కంది పోయింది, తనన్నమాటకు.

ఎంత కఠినంగా అన్నాడు? ఎల్లా అనగలిగాడు? తననంత ప్రేమగా చూచేతల్లి ఎత్తి పొడిచేందుకు అంటుందా? ఏదో మాటవరసకు అని ఉంటుంది. విసిరాడు తను తన ఆత్మను చంపుకునే సమర్థతలేని అసమర్థుడు. అలా అని సంపాదించలేనివాడు—ఎంతమాట అన్నాడు!

క్షమించమని కాళ్ళట్టుకుని తన బాధ చెప్పుకుందాం అనిపించింది.

అమ్మ నాన్నతో చెప్తూంది. "ఏమిటో ఏదో పెద్దవాళ్ళకూ ఆడవాళ్ళకూ కాని పెళ్ళిళ్ళల్లో చదువుకున్న వాళ్ళకు సర్దాఏమిటి చెప్పండి...ఆ మాటకొస్తే మనంమాత్రం ఏదో బాముకుందాం అని వెళ్తున్నామా తప్పని సరికనక కాని! వాణ్ణి యిక్కడే ఉంచివెళ్దాం..."

మాతృహృదయం. తను ఏమన్నా అపార్థం చేసుకోదు. ఆమె తన మంచికోసం చెప్పినా తనకు అహంభావం; విసుక్కుంటాడు. మాతృమూర్తి, దేవతామూర్తి మనస్సులోనే నమస్కరించుకున్నాడు మధు.

"అహఁ, దానికోసంకాదు. అదోలా ఉంటున్నాడు. వాడిధోరణి మారుతుందేమో నలుగుర్నీ చూస్తే అని..."

అమ్మ ఏదో చెప్పింది. నాన్నగారు యింకేమీ మాట్లాడలేదు.

తను ఏదోలా అంటున్నాడా? ఆ...! ఏమిటి తను మారిపోతున్నాడా? అందరిలా ఉండటం లేదూ? అస్తమానం యివేమిటీ యీ ఆలోచనలు. చదువుకుందాం అంటే యిదే ఆలోచన—సర్వకాల సర్వావస్థలలోనూ—తనకు మతిచలిస్తోందా?

* * *

"అబ్బాయి! బొత్తిగా చిక్కిపోతున్నావురా!" అంది అమ్మ.

చిక్కిపోతున్నాడా? సరిగా అన్నం తినడం లేదుట. కావలిసినంత తింటాడు. అక్కర్లేనిది ఎల్లా తినగలడు?

"అమ్మా ఏమిటో ఒకొక్కసారి భోజనం చెయ్యడంకూడా బద్ధకం అనిపిస్తోంది." అమ్మ ముఖంలో భయరేఖలు అలుముకున్నాయి. చాలా తొందరగా అంది వెంటనే "అదేమిట్రా అలా అంటావ్ అవేం ఆలోచనలు? అన్నం తినడం బద్ధకం ఏమిట్రా?"

ఆమె తొందరచూసి తనకే భయంవేసింది. ఏమిటి? తనమాట అంత భయపెట్టేదా?

ఏవో అనకూడని మాటలు అనేస్తున్నాడు తను. రారాని ఆలోచనలు అలుము కుంటున్నాయి. పోకూడని పథాల్లో అడుగుపెట్టేందుకు తయారు అవుతున్నాడు.

* * *

అరే మల్లిక! ఎల్లావచ్చింది! ఇన్నాళ్ళ తర్వాత! తను ఉత్తరాలు కూడా వ్రాయడం మానేశాడే!

"మీ నాన్నగారు వ్రాసిన ఉత్తరం చూసుకు వచ్చాను—ఘనకార్యం చెయ్యడం మొదలు పెట్టురటగా—ఉత్తరాలు వ్రాయడంకూడా మాస్తే దొరలు మర్చిపోయారనుకున్నా పాతప్రపంచాన్ని. ఇంకా యిక్కడే ఉన్నారే!..."

మల్లిక—భలే అమ్మాయి. అలా వాన జల్లులా వచ్చింది. అలా మాట్లాడేస్తుంది. ముందు కొంపలు మునిగినట్టు మొదలుపెట్టి ఏంలేదని తేలుస్తుంది, చివరికి చీకూ చింతాలేవు. అలా నవ్వుతూ పేలుతూ ఉంటుంది.

"ఉత్తరాలు వ్రాయకపోతే పోనీ-ఏంమర్యాద నేర్చుకున్నారండీ —వస్తేకూడా మాట్లాడరా...?"

అవును అన్నట్టు పాతవిషయాలు చాలా అడగాలి, ఎందుకొచ్చినా,ఎల్లావచ్చినా. ఎల్లావచ్చిందీ?

"మామూలుగా రైలుమీద."

"అదికాదు మా నాన్నగారు ఉత్తరం..." అన్నాడు. మల్లిక ఉత్తరం చూపించింది.

"తప్పే అని తెలిసుండీ తప్పక—వాడి పాత ఉత్తరాలు తిరగేశాను. మేమెవ్వరం, ఆఖరికి తల్లి కూడా వాడి హృదయాన్ని చేరలేక పోయింది. ఎవరయినా స్నేహితులు ఉన్నారేమోనని ఉత్తరాలు చూశాను. అదృష్టవశాత్తూ మీ ఉత్తరాలు కనపడ్డాయి. మేం ఆక్రమించుకోలేని స్థానాన్ని మీరు ఆక్రమించుకున్నారు. నానాటికీ చిక్కిపోతున్నాడు. తను వేరేప్రపంచం ఏదో సృష్టించుకుంటున్నాడు. వాడిని రక్షించుకోవలసిన బాధ్యత—"పకపకానవ్వి ఉత్తరం చటుక్కున లాక్కుంది మల్లిక.

ఎంత బాధపెట్టాడు తండ్రిని. కనిపెంచిన తల్లీ తండ్రీ తనకు దగ్గరగా రాలేకపోయారా?

"ఏమండోయ్...మీ ఆలోచనల్ని, మీ చేతల్ని అన్నింటినీ పరిపాలించేది నేను. ఇల్లా ఇటు చూడండి... ఛప్ ఆలోచించ కూడదు..."

ఆగిపోయాయి ఆలోచనలు. తండ్రిఉత్తరం వ్రాయగానే మల్లిక వచ్చేసింది. ఎందుకురావాలి? సంతోషంగా తన బాధ్యత నెత్తిమీద వేసుకుంటూంది. ఇదేంపని? తనేమన్నా చంటిపిల్లవాడా?

"మల్లికా...అబ్బబ్బ..."

విసుక్కుందా మనుకోకుండా విసుక్కున్నాడు తను.

"ఇదుగో ఇలా చూడండి. అలా విసుక్కోకూడదు. మీ నాన్నగారు అన్నట్టు, దూరంగా ఉన్నవాళ్ళను విసుక్కుంటే మరింత దూరంగా పోతారు—కాని దగ్గరగా ఉన్నవాళ్ళను విసుక్కున్నారా వదల్రు. నేను ఏంచేస్తానో తెలుసా విసుక్కుంటే మరింత విసిగిస్తా—"

బలేగా మాట్లాడుతుంది. విసుక్కుంటే మరింత విసిగిస్తుందట—

"ఇంకా విసిగిస్తాననుకోండి. అప్పుడేంచేస్తారు? మీకు కోపంవస్తుంది. ఏదో అంటారు. నేను మీరు అలా అనుకుని అనలేదులే, ఊరికే కోపంలో అన్నారు, అనుకుని నవ్వి ఊరుకుంటాను."

నిజం అంతేనేమో — మనం చెడు అర్థంతో అన్నా మంచి అర్థం తీసుకుంటే మనం కూడా బాగుపడి పోతాం ఏమో.

"మీకు ఇంకా కోపం వస్తుంది. మరొకళ్ళ నవ్వుతే కొడ్తారు. మరి నేను అమ్మాయిని కదేమిటి; కొట్టేందుకు మీ సంస్కారం అడ్డువస్తుంది."

తనకు కూడా నవ్వొచ్చింది. మూగదేవుడు హఠాత్తుగా నవ్వేశాడు. మల్లిక నవ్వు మల్లెపూల సౌరభాలు వెదజల్లింది. ఆనందపు వెన్నెలతో హృదయం నిండింది.

అప్పుడే ప్రవేశించిన అమ్మ ముఖంలో సంతోషం—చంద్రకళల్ని సేకరించింది.

* * *

"చదువుకున్నన్నాళ్ళూ మేం ఉద్యోగం కోసం తప్పక చదువుకున్నాం—మీకు చదువెందుకు అని అప్పుడప్పుడు విసిరేవారు—మీరు చదువుకుని ఉద్యోగం ఏం వెలిగిస్తున్నారండీ!"

ఏం వెలిగిస్తున్నాడు? అంతా గంగ పాలు. ఈ నాటికీ ఉద్యోగంలేదు. ఎక్కడా ఖాళీల్లేవు. ఉన్నా డెబ్భైఅయిదు రూపాయల ఉద్యోగాలు. తను చదువు కుంటున్నప్పుడు వంద ఖర్చుపెట్టే వాడు. తను సరే, మల్లిక ఏం చేస్తున్నట్టు...

"నేనా...తమాషా చేస్తున్నా. మీరనుకున్నారు, ఆడవాళ్లు పెళ్లిళ్లు చేసుకుని పిల్లల్ని కనేందుకే పుట్టారని! మగవాళ్లే అందుకే పుట్టారు! పెళ్ళిచేసుకుని ఉంటే ఈపాటికి మీరుబాగుపడుదురు..."

తను దూర సందు లేదు, మెడకొక డోలు!

"మిమ్మల్ని, కూడా తీసుకువెళ్తున్నా. తమకు ఉద్యోగం ఇస్తున్నా! దొరలకి నామోషీకాబోలు ఆడది ఉద్యోగం చూపిస్తే చెయ్యడం..."

ఆ అనేవిధానంచూస్తే మల్లికని...అనిపించింది.

* * *

మధుకు స్వర్గంలో ఉన్నట్టఉంది. ఒక్క ఆడపిల్ల యిలా చెయ్యగలదా అనిపించింది. కాని చేసింది. చిన్న యిల్లు వేయించింది. దాంట్లో ఉంటోంది. తన జనకూడా అక్కడే. చుట్టూ చక్కటి తోట. కష్టపడి స్వయంగా నీళ్లుపోస్తుంది. "అమ్మగారు అమ్మగారు" అంటూ రైతులు గౌరవంగా చూస్తున్నారు. పొద్దున్నే అయిదుగురు ఎస్. ఎస్. ఎల్. సి. పిల్లలు వచ్చారు. చదువు చెప్పింది. రాత్రి రైతులకు పాఠాలుచెప్తోంది. నిన్నటి చిలిపి మల్లిక, తగువులుకూడా తీరుస్తోంది. తనకు ఏదో పట్టరాని సంతోషంవచ్చింది. ఆ అయిదుగురు పిల్లలు యిచ్చేడబ్బు చాలుట ఒక వ్యక్తి జీవించేందుకు. మిగతా వేళల్లో పుస్తకాలు చదవడం అవీ యివీ చేస్తూఉంటుంది.

ఆ చిలిపి మల్లిక ఏదీ ఏమయిపోయింది?

"ఇల్లా పెద్దమనిషిలా సంచరించడం చాలా కష్టం. నాకు ఈ జీవితంకూడా విసుగుగా ఉంటుంది. నేను నాలా ఉండగా అర్థంచేసుకునే ఒక వ్యక్తి కావాలనుకుంటూ—నాస్థాయి అందుకునేవాళ్లు లేరు...ఇక్కడ..."

మల్లిక జీవిత విధానం చూస్తూఉంటే తనకు ఏదో బలంవచ్చింది. తనమీద తనకు గౌరవం వచ్చింది. తన కాళ్ళమీద తను నిలబడగలడు. బి. ఏ. డిగ్రీ మల్లికకు సంస్కారం కూడా ఇచ్చింది. తను ఒక్క ఉద్యోగం దృష్టితోనే చదివాడు. అంచేత ఉభయభ్రష్టు అయాడు. ఆమె సంస్కారం కోసం చదివింది. ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంది.

మధు దృక్పథంలో మార్పు వచ్చింది. నిరాశ నిస్పృహలవల్ల పనులుకావు. ఎవరో మనకోసం ఏదో చెయ్యాలంటే మన జీవితాలు ఇంతే. సుఖం దుఃఖం మన మనస్సే సృష్టించుకుంటుంది. అవి రెండుకావు ఒకటే. చూడ్డంలో తేడా అంతే.

"ఆలోచించవద్దన్నా. తెలిసిందా? ఇంకో పది మంది పిల్లలు వస్తున్నారు. వాళ్ళకి చదువుచెప్పండి తెలిసిందా? సరిగ్గా చెప్పకపోతే జాగర్త..."

పేకబెత్తం చూపిస్తోంది మల్లిక!

"మల్లికా!" అని ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు మధు.